క్లుప్తంగా

సభ్యత్వ నమోదు శతశాతం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఏపీఎం సింహాచలం

సాలూరు: మహిళామార్టు సభ్యత్వ నమోదును వచ్చే సోమవారం నాటికి శతశాతం పూర్తిచేయాలని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం జి.సింహాచలం అన్నారు. ఈ మేరకు శుక్రవారం తన కార్యాలయంలో వెలుగు గ్రామ సంఘాల సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళామార్టుల నిమిత్తం గ్రామసంఘాల వారీగా జరిగిన సభ్యత్వాల నమోదుపై ఆరా తీశారు. సభ్యత్వ నమోదులో నిర్లక్ష్యాన్ని విడనాడాలని, సభ్యత్వ రుసుముల వసూలు వేగవంతం చేయాలని కోరారు. స్త్రీనిధి ద్వారా బ్యాంకు లింకేజీ రుణాల చెల్లింపులు, నూతన రుణాల మంజూరు తదితర అంశాలపై ఆరా తీశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని హితవు పలికారు.

విద్యార్థుల సంబరం



పలగర ప్రాథమిక పాఠశాలలో ఆటపాటల్లో విద్యార్థులు

బలిజిపేట: విద్యా సంవత్సరం ముగింపు కావడంతో విద్యార్థులు సంబరంలో మునిగిపోయారు. విద్యాసంవత్సరం ముగింపు సందర్భంగా విద్యార్థులకు పాఠశాలల్లో ఫేర్‌వెల్ ఫంక్షన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పాటలు పాడి, డ్యాన్సులు చేయడంతో వారిలో నూతనోత్సాహం కలిగింది. అందులో భాగంగా పలగర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఎంతో సంబరంగా గడిపారు. విద్యార్థులకు ఉపాధ్యాయ సిబ్బంది మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్ధారించిన ప్రకారం పనులు



బైరిపురంలో ఉపాధి పనిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ భానుమూర్తి

బలిజిపేట: కొలతలు నిర్ధారించిన ప్రకారం వేతనదారులు పనులు చేయాలని ఎంపీడీఓ భానుమూర్తి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బైరిపురం గ్రామంలో ఉపాధిపనులను పర్యవేక్షించి వేతనదారులతో మాట్లాడుతూ పని చేసేటప్పుడు ముందస్తుగా పనినిర్ధారణ, దానికి సంబంధించిన కొలతలు తీసుకుని పని చేయాలని స్పష్టం చేశారు. అలా కాకపోతే ఏ పని చేశారు, ఎంత పని జరిగిందో లెక్కలోకి రాదని దానివల్ల వేతనదారులు నష్టపోతారని హితవు పలికారు. పనికి సమయానికి రావాలని వేతనదారులకు, పని ప్రదేశంలో మౌలిక సదుపాయాల కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ కేశవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్డీపీఓగా సునీల్ సెరోన్ బాధ్యతల స్వీకరణ



ఎస్‌డీపీఓ సునీల్ సెరోన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సై సీతారాం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం ఎస్‌డీపీఓగా సునీల్ సెరోన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని ట్రాఫిక్ సమస్య, నాటుసారా నిర్మూలనకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రస్తుతం ఎస్‌డీపీఓగా ఉన్న ఎ.సుభాష్ బాధ్యతలను అప్పగించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సునీల్ సెరోన్‌ను పలువురు పోలీస్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

సీఓపీ సర్వే వేగవంతం చేయండి

సంతకవిటి: మండలంలోని కాకరాపల్లి పంచాయతీ అక్కరాపల్లి గ్రామంలో ఎంపీడీఓ యస్.రఘునాధాచారి సీఓపీ(సిటిజన్ ఔట్ రీచ్ పల్స్) సర్వేను శుక్రవారం పరిశీలించారు. సర్వేను వేగవంతం చేయాలని సంబంధిత పచివాలయ సిబ్బందిని ఆదేశించారు. రోజుకు 50 శాతం చొప్పున రెండు రోజుల్లో సర్వేను పూర్తి చేయాలని అన్నారు. సర్వే సమయంలో అందుబాటులో ఉన్న అందరి చేత తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాలని ఆదేశించారు. ఏపీఓ త్రినాధరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుపై ఐదు శాతం రాయితీ

బొబ్బిలి: ఆస్తి పన్ను, ఖాళీ జాగాలపై పన్ను చెల్లింపులకు ఈనెల 30 వరకు 5 శాతం రాయితీ వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకమొత్తంలో చెల్లించే వారి కోసం ఆదివారం కూడా కార్యాలయంలో కౌంటర్ తెరిచే ఉంటుందని, పన్ను చెల్లింపుదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

తోటపల్లి అదనపు ఆయకట్టుకు సాగునీరు

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: తోటపల్లి సాగునీటి ప్రాజెక్ట్ కుడి కాలువపై గల అరసాడ డిస్ట్రిబ్యూటరీ బ్రాంచ్ కెనాల్ నుంచి 3212 ఎకరాల వర్షాధారం భూములకు వచ్చే ఖరీఫ్‌సీజన్‌కు సాగునీరు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తోటపల్లి కుడి కాలువ గాదెలవలస వద్ద 2021–22లో ప్రారంభించిన బ్రాంచికాలువ పనులను ఇంజినీరింగ్ అధికారులతో పరిశీలించి, రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్ట్ కుడి కాలువ నుంచి గాదెలవలస వద్ద ఆరంభించిన అరసాడ డిస్ట్రిబ్యూటరీ బ్రాంచి కెనాల్ నుంచి అదనపు ఆయకట్టు 3,212 ఎకరాలకు నీరు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అదనంగా నిధులు మంజూరుచేసినట్లు తెలియజేశారు. పనులు పూర్తిచేసి వచ్చేఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించాలని సంకల్పించామన్నారు.

నష్టపరిహారం మంజూరులో జాప్యం

2021–22 ఖరీఫ్ సీజన్‌లో పనులు ప్రారంభించినప్పటికీ కాలువ నిర్మాణంలో భాగంగా సాగు భూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం పంపిణీలో జాప్యం జరిగినందున రైతులంతా కాలువ నిర్మాణానికి ఆటంకం కలిగించినట్లు సంబంధిత ఉన్నతాధికారుల ద్వారా సమాచారం తెలుసుకున్నామని తెలియజేశారు. ఈ నేపథ్యంలో అధికారులతో కలిసి క్షేత్ర స్థాయి పరిశీలన చేసి స్థానిక రైతులతో చర్చించి కాలువ నిర్మాణానికి అవసరమైన భూమి 'డీ పట్టా' భూమి అయినప్పటికీ ప్రభుత్వం నుంచి సాగుదారులకు ఆర్థికసహాయం అందించడానికి అధికారులు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తోటపల్లి ప్రాజెక్ట్ కుడికాలువ ఇరిగేషన్ డీఈ రఘు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, స్థానిక సర్పంచ్ బి అన్నపూర్ణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుపతిరావు, వివిధగ్రామాల రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పనులు



తామరఖండిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలో అర్హులైన వారందరికీ పని కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు తామరఖండి, చినభోగిలి, బగ్గందొరవలస, బళ్లకృష్ణాపురం గ్రామాల్లో వేతనదారులు చేస్తున్న పనులను ఎన్ఆర్ఈజీఎస్ జేఈ కృష్ణ, టెక్నికల్ సహాయకులతో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తామరఖండి మట్టి రోడ్డు పనుల వద్ద మాట్లాడుతూ మండలంలోని ఉపాధి పనులు కల్పించడం వల్ల వలసలు నిరివారించగలిగామన్నారు. అర్హులైన వారందరికీ పనులు కల్పించడంతో పాటు వారు జీవిస్తున్న గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసుకోవడం వల్ల మంచి జరుగుతుందన్నారు. వేతనదారులు సమయపాలన పాటించి టీఏలు నిర్దేశించిన మార్జిన్‌లో పనిచేసి వేతనం గిట్టుబాటయ్యే విధంగా చూసుకోవాలని హితవు పలికారు. జేఈ కృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో సామాజికపరమైన అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రణాళికలు తయారు చేయాల్సి ఉందన్నారు. లింక్ రోడ్డు, గోర్జలు, మంచినీటి కోనేర్లు అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం



ఎమ్మెల్యే జోగారావుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

పార్వతీపురంటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు గరుగుబిల్లి ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేస్కేల్, కనీసవేతనం రూ.26 వేలు చెల్లించాలని, అటెండర్, నైట్ వాచ్‌మన్, కంప్యూటర్ ఆపరేటర్ పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నూతనంగా ప్రవేశపెట్టిన 104 జీఓను రద్దు చేసి 166 జీఓను పునరిద్ధరించాలని, ఇంటర్మీడియట్ అర్హత మీద పదోన్నతులు కల్పించాలని, కరోనా సమయంలో జీతంలో కట్ చేసిన రూ.2 వేలు తిరిగి చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎ. కృష్ణారావు, సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఒ. విజయకుమార్, ఎస్ కృష్ణారావు, సుధ, ఎస్.శ్రీనివాసరావు. టి.నాగయ్య పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో మెరుగైన సేవలు

సీతానగరం: ప్రభుత్వం అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానం ద్వారా వ్యాధిగ్రస్తులకు ఇంటివద్దనే వైద్యసేవలు అందించడం వల్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఉషారాణి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె కొత్తవలసలో సర్పంచ్ రెడ్డి అనిత ఆధ్వర్యంలో 104 సంచారవైద్య ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ గ్రామాల్లో 104 సంచార వైద్య కేంద్రంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించడం, రోగనిర్ధారణ చేయడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మంచానపడిన వ్యాధిగ్రస్తుల గృహసందర్శన చేసి వైద్యసిబ్బంది పర్యవేక్షణలో సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో 104 సిబ్బంది దుర్గారావు, ప్రసాద్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

రంగప్పవలస పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

తెర్లాం: మండలంలోని రంగప్పవలస ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ త్రినాథరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, జగనన్న గోరుముద్ద మెనూ అమలు, మరుగుదొడ్ల నిర్వహణ, పాఠశాల పరిసరాలను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, జగనన్న గోరుముద్ద పథకంలో నిర్వాహకులు మెనూ ప్రకారం వంటలు చేస్తున్నారా, లేదా అని ఉపాధ్యాయులు పరిశీలించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు ప్రభుత్వం ఇచ్చే విద్యాకానుక, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద పథకాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు.

ఆయుర్వేద వైద్యంతో రోగాల నయం

రేగిడి: ప్రభుత్వ ఆయుర్వేద మందులను దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వినియోగిస్తే ఎంతో ఉపయోగం ఉంటుందని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్ సూచించారు. మండలంలో కొమెర గ్రామంలో ఆయుర్వేద వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 52 మందికి తనిఖీలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. శిబిరంలో సర్పంచ్ పాడి లక్ష్మున్నాయుడు, హెచ్ఎం శ్రీనివాసరావు, యోగా ఇన్‌స్ట్రక్టర్ రామకృష్ణ, శైలజ, ఏఎన్ఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో ఆరోగ్య సూత్రాలు పాటించాలి

రేగిడి: మండలంలో మునకలవలస గ్రామంలో రాజాం కేర్ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత చర్మవ్యాధుల వైద్య శిబిరాన్ని జీఎంఆర్ ఐటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ నిర్వహించింది. శిబిరంలో పలువురుకు వైద్యతనిఖీలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు వినోద్ మాట్లాడుతూ వేసవిలో ఆరోగ్య సూత్రాలు పాటించాలని, ప్రధానంగా చర్మవ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. సర్పంచ్ వి.చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కేవీఎస్ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామానికి చెందిన యువకులు పాల్గొన్నారు.

పెండింగ్ వాహన పన్నులు చెల్లించాలి



మాట్లాడుతున్న ఆర్టీఓ శశికుమార్

సీతానగరం: రవాణాశాఖకు దీర్ఘకాలంగా పన్నులు చెల్లించక పెండింగ్‌లో ఉన్న వాహనదారులు వెంటనే చెల్లించి సహకరించాలని జిల్లా రవాణాశాఖ(ఆర్టీఓ) అధికారి శశికుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీతానగరం, గరుగుబిల్లి,బలిజిపేట మండలాల ప్రాంతాల్లో తిరుగాడుతున్న వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీపురంలో మాట్లాడుతూ జిల్లాలోని వాహనాలకు పన్నులు కట్టడంలో వాహన చోదకులు అలసత్వం వహించడం తగదన్నారు.

వాహన యజమానులు రోడ్డుమీదకు వాహనాలతో వచ్చే సమయంలో వాహనానికి సంబంధించిన రికార్డులు అప్‌డేట్‌లో ఉన్నాయా లేదా పరిశీలించాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాల తనిఖీముమ్మరం చేశామన్నారు. ఆటోలలో నిబంధనలకు మించి ప్రయాణికులను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలకు కట్టాల్సిన పన్నులు నిర్దేశించిన గడువులోగా చెల్లిస్తే ఎటువంటి సమస్య రాదని లేని పక్షంలో అపరాధరుసుంతో చెల్లించవలసి ఉంటుందన్నారు. ఈ విషయమై వాహన యజమానులు రవాణా శాఖకు సహకరించాలని కోరారు.

1998 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఘనంగా సత్కారం



గిరిజన ప్రతిభా విద్యాలయంలో 98 డీఎస్సీ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విద్యార్థులు

సీతానగరం: మండలంలోని జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయంలో దీర్ఘకాలంగా ఉపాధ్యాయ విధులు నిర్వహించిన బి.సురేష్, పొట్నూరు రమణలను విద్యార్థులు, అధ్యాపకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ పి వెంకటి నాయుడు మాట్లాడుతూ జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయంలో జంతు శాస్త్ర అధ్యాపకుడు బి.నరేష్, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు పొట్నూరు రమణ 1998 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా నియమితులైనట్లు తెలియజేశారు. ఇంతవరకూ ఇక్కడి సేవలందించిన ఆ ఉపాధ్యాయులను సత్కరించడం అభినందనీయమన్నారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ ప్రభుత్వం 1998 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా నియమించడంతో ఇక్కడ ఉపాధ్యాయులుగా విధులనుంచి తప్పుకున్నామన్నారు. ఇంతవరకూ తమకు సహకరించిన సహచరులకు, సిబ్బందికి, విద్యార్థులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతినాయుడు, ఇంగ్లీష్ అధ్యాపకుడు ఈఎల్ నాయుడు, సహచ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వే రాళ్ల ప్రక్రియ వేగవంతం చేయండి

● కలెక్టర్ నిషాంత్ కుమార్



జనార్దనపురం వద్ద ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

బలిజిపేట: భూ రక్ష, భూ హక్కులో భాగంగా మిర్తివలస, జనార్దన పురం గ్రామాల్లో సర్వే రాళ్ల ఏర్పాటును కలెక్టర్ నిషాంత్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. రీ సర్వే మూడో విడత కార్యక్రమం త్వరలో ప్రారంభం కానుందని ఈ సందర్భంగా తెలిపారు. రెండు విడతల్లో ఇప్పటివరకు పూర్తయిన భూములకు సర్వే రాళ్లు వేగవంతం చేయాలని, వచ్చే నెల 15వ తేదీ నాటికి శతశాతం పూర్తిచేయాలని సూచించారు. రీ సర్వే ప్రక్రియను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని సర్వే పూర్తిచేయించినందున రాళ్లు పాతే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. మండలస్థాయిలో ఇప్పటికే రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రక్రియ చురుగ్గా సాగాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ రత్నకుమారి, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ, బహిరంగ సభ విజవంతం చేయండి

● వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ అనే ప్రచార కార్యక్రమం ద్వారా మెగా పీపుల్ సర్వే పూర్తయిన సందర్భంగా శనివారం పట్టణంలో నిర్వహించనున్న ర్యాలీ, బహిరంగ సభ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పురపాలక సంఘం ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కన్వీనర్లతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం చివరి రోజుకు చేరుకున్న సందర్భంగా పార్వతీపురం నియోజకవర్గ కేంద్రంలో పార్టీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీతో పాటు బహిరంగ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్వతీపురం పురపాలక సంఘంతో పాటు మూడు మండలాల వైఎస్సార్‌సీపీ శ్రేణులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. శనివారం ఉదయం 9:30 గంటలకు, పార్టీ కార్యాలయం (గూడ్స్ షెడ్ రోడ్), వద్దకు తప్పకుండా పెద్ద సంఖ్యలో అనుకున్న సమయానికి చేరుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పురపాలక సంఘం అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, 30 వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం ఉపేక్షించం



మాట్లాడుతున్న డ్వామా పీడీ రామచంద్రరావు

● డ్వామా పీడీ రామచంద్రరావు

సాలూరు: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని డ్వామా పీడీ కె.రామచంద్రరావు స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సాలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పార్వతి ఆధ్వర్యంలో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా మండలాల వారీగా వేతనదారుల సంఖ్య, ఉపాధి హామీ పనుల ప్రగతి, వసతుల కల్పన తదితర అంశాలపై ఆరా తీశారు. సాలూరు, పాచిపెంట మండలాల్లో పనుల కంప్యూటరైజేషన్ తదితర పనులు వెనుకబడడంపై మండిపడ్డారు.నిర్లక్ష్యానికి గల కారణాలేమిటని నిలదీశారు. అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలని, దినసరి వేతనం కనీసం రూ.250 తక్కువ కాకుండా చూసుకోవాలని ఆదేశించారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో వసతులు కల్పించాలని, వేసవి దృష్ట్యా ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఏఎన్ఎంల నుంచి ప్రథమచికిత్స కిట్లు తీసుకుని, పనులు చేపడుతున్న ప్రాంతాల సమీపంలో కూలీలకు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు కృష్ణారావు, కార్తీక్, ఈశ్వరమ్మ, జేఈలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే..

● డిప్యూటీ సీఎం రాజన్నదొర



లబ్ధిదారుడికి బుక్‌లెట్ అందజేస్తున్న డిప్యూటి సీఎం రాజన్నదొర

మెంటాడ: రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్నదొర జోస్యం అన్నారు. మండలంలోని జక్కువలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి రాజన్నదొరకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి, తదితరులు ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయం తెలుసుకున్నారు. అలాగే ఒక్కో కుటుంబానికి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారన్నారు. గ్రామాలు, పట్టణాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలను వైఎస్సార్‌సీపీ నాయకులను ఆదరిస్తున్నారని తెలిపారు. గడప గడపకు... జగనన్నే మా భవిష్యత్.. వంటి కార్యక్రమాలు విజయవంతం కావడం ఇందుకు నిదర్శనమన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ లచ్చిరెడ్డి సత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సంధ్య, ఎంపీపీ ఆర్ఎస్ నాయుడు, వైస్ ఎంపీపీ ఎస్ఈ రావు, మండల నాయకుడు ఎల్ఆర్ నాయుడు, పీఏసీఎస్ చైర్మన్ ఆర్.అప్పారావు, రాజప్పలనాయుడు, పి.అచ్చుత్, లచ్చిరెడ్డి అప్పలనాయుడు, కర్రి అప్పలస్వామి, మయూరి అప్పలనాయుడు, హనుమంతరాజు, భాయి అప్పారావు, పున్నాన చిన్నంనాయుడు, మోహన్, కిలపర్తి మధు, ఎంపీడీఓ త్రివిక్రమ్, తహసీల్దార్ ఆదిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రీ సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలి



రీసర్వేలో రోవర్ విధానాన్ని వివరిస్తున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: గ్రామాల్లో జరుగుతున్న జగనన్న సమగ్ర 'భూరక్ష' 'భూ హక్కు' సర్వే పనుల్లో పాల్గొనే రెవెన్యూ సర్వే అధికార సిబ్బందికి రైతులు సహకరించాలని తహసీల్దార్ ఎన్వీ రమణ కోరారు. ఈ మేరకు శుక్రవారం పాపమ్మ వలస, ఇప్పలవలస, చిన్నారాయుడుపేట గ్రామాల్లో అధికార సిబ్బంది రోవర్ విధానం ద్వారా చేపడుతున్న రీ సర్వే పనులు, భూముల హద్దులు గుర్తించే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు గ్రామాల్లో దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కరించాలన్న సంకల్పంతో ప్రభుత్వం భూ రక్ష, భూ హక్కు పథకాన్ని అమలు చేసిందన్నారు. రెండు సర్వేలు పూర్తి చేసిన గ్రామాల్లో రోవర్ విధానం ద్వారా భూములకు సర్వే రాళ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాళ్లు అమర్చే సమయంలో భూములకు చెందిన రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాపమ్మవలస సర్పంచ్ ఎం గౌరునాయుడు, మండల సర్వేయర్ శంకరరావు, వీఆర్వోలు,సర్వే సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

గర్భిణికి రక్తదానం చేసిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి



రక్తదానం చేస్తున్న దుర్గాప్రసాద్

పార్వతీపురంటౌన్: మండలంలోని చిన్నబుడ్డిడి గ్రామానికి చెందిన గర్భిణి కోనేటి మాధురి రక్తహీనతతో శుక్రవారం పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చేరింది. చికిత్స నిమిత్తం ఆమెకు రక్తం అవసరమని వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని బంధువులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులకు తెలియజేయడంతో ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి బత్తుల దుర్గాప్రసాద్ వెంటనే స్పందించి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేసి గర్భిణి ప్రాణాలు కాపాడారు. తక్షణమే స్పందించిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి బత్తుల దుర్గాప్రసాద్‌ను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు, పేషంట్ బంధువులు అభినందించారు.

మాతా శిశుమరణాల నివారణే లక్ష్యం

● డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథ రావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథ రావు

పార్వతీపురంటౌన్: మాతా శిశుమరణాల నివారణే లక్ష్యంగా సిబ్బంది కృషిచేయాలని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు సూచించారు. ఈ మేరకు ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ, మాతా శిశుసంక్షేమశాఖ సూపర్‌వైజర్లు, సీడీపీఓలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గర్భిణిగా నమోదైనప్పటినుంచి ప్రసవం జరిగేంతవరకు అన్ని వైద్యపరీక్షలు, ఆరోగ్య తనిఖీలు సక్రమంగా జరిగేలా పూర్తిస్థాయిలో ఆరోగ్య పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. గర్భిణులను గుర్తించి నమోదు చేయాలని, అందుకు అవసరమైన పరీక్షల కిట్లు అన్ని గ్రామాల్లో వైద్యసిబ్బంది వద్ద అందుబాటులో ఉంచాలని చెప్పారు. దీనిద్వారా హైరిస్క్ గర్భిణులను త్వరగా గుర్తించి అందుకు అవసరమైన కార్యాచరణ చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి రోజూ ఐరన్ మాత్రలు సమయానికి వేసుకునేలా ప్రతి గర్భిణిని పర్యవేక్షించాలని చెప్పారు. రక్తహీనత గుర్తించిన గర్భిణులకు హిమోగ్లోబిన్ శాతం సాధారణ స్థితికి చేరేవరకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.

మూఢ నమ్మకాలను తరిమికొట్టాలి

గిరిశిఖర గ్రామాలు, రవాణా సదుపాయం లేని ప్రాంతాల్లో గర్భిణులను, హైరిస్క్ గర్భిణులను ముందస్తుగానే బర్త్ ప్లానింగ్ చేసి ప్రసవానికి వారానికి ముందుగానే సంబంధిత రిఫరల్ ఆస్పత్రి గర్భిణుల వసతికేంద్రాల్లో చేర్చాలని సూచించారు. బాలింత, శిశు ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపట్టాలని నవజాత శిశువులను తరచుగా పర్యవేక్షించి శ్వాసకోశ సంబంధిత వ్యాధులు గుర్తించడం, బిడ్డ తల్లి పాలు సరిగ్గా తీసుకుంటున్నది లేనిది, బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి అవసరమైన చికిత్స అందజేయడం, మూఢనమ్మకాలపై అవగాహన కలిగించి తరిమికొట్టగలిగితే శిశు మరణాలను తగ్గించవచ్చునన్నారు.

రక్తహీనత నివారణకు పోషకాహారం అవసరం

జిల్లా ఐసీడీఎస్ పీడీ కె.విజయగౌరి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందజేస్తున్న పోషకాహారం ఆవశ్యకతను వారికి వివరించాలని, రక్తహీనత నివారణకు ఇది ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో డీఐఓ టి.జగన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ జీవీ రమణ, ప్రోగ్రాం అధికారి వినోద్ తదితరులు పాల్గొన్నారు.